

# అమావాస్య

వై. జయలక్ష్మి

"పాతిక వేలు. కాస్తా కూస్తా కాదు. ఈ జన్మలో అంతడబ్బు సంపాదించగలవేమో ఆలోచించు. కాలు కదిపే కష్టంలేకుండా పాతికవేల రూపాయలమూట వచ్చి వొళ్ళో పడతానంటే వద్దని ఏడుస్తావేంరా? ఎర్రగా బుర్రగా వుందనేనా ఆదెవత్తో అంటే మోజుపడి జస్తున్నావు? అయినా నాకు తెలియక అడుగుతాను. ఆడదానికి అసలు అందం ఎందుకంట? సంసార పక్షంగా యిల్లు తీర్చి దిద్దుకుని పనిపాట చేసుకోవాలి కానీ తగుదునమ్మా అని ఉద్యోగాలు ఏలే ఆవిది మొగాడి మాట వింటుందంటరా?

"అయినా పట్నంలో ఆడపిల్లలు ఆడపిల్లల్లా ఉన్నారా? వేలుపోసి పెళ్ళి చేసుకోలేక ఆ ఉద్యోగం వంక పెట్టుకుని మగవాళ్ళకీ వలలు వేసి నీలాంటి దద్దమ్మ ఒకడు దొరికితే పెళ్ళి యిందనిపించుకుంటున్నారు. అంతెందుకూ! నీకంటే నాలుగు రాళ్ల ఎక్కువ సంపాదించుకునేవాడు దొరికితే ఆ పిల్ల నిన్ను చేసుకుంటానంటుందేమో చూడు!" సవాలు చేస్తున్నట్లు అన్నారు వీరయ్యగారు.

"అన్యాయం నాన్నా- ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లలని అంతలేసి మాట లనటం ఘోరం. పదిమంది మగవాళ్ళ మధ్య కూర్చుంటారనేగా అంత చులకనగా మాట్లాడుతున్నారు. ఆమాత్రానికి వాళ్లకి మానాభిమానాలు ఉండవని అనుకోవటం చాలా పొరపాటు. అది గుణంలో ఉంటుంది కానీ చదువులోనూ, చేసే ఉద్యోగంలోనూ వుండదు. ఆ మాటకి వస్తే గుమ్మందాటి వెళ్ళని ఆడవాళ్ళు ఎన్ని గ్రంథాలు నడపరు కనుక?" వాడిగా వేడిగా అనాలనుకున్నాడు చిట్టిబాబు. కళ్ళల్లో కోపం బాధా కదులాయి. గొంతువరకూ ఆవేశం వచ్చింది. కానీ ఎదురుగా

వున్న వీరయ్యగారి వీరావతారాన్ని చూశాక మరి గొంతు పెగలలేదు.

"మాట్లాడవేంరా?" సంజాయిషీ అడుగుతూ తల్లి.

కోపం, ఆవేశం అవిరయి ఎగిరిపోగా బాధని మాత్రం మిగుల్చుకుని "నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి" అన్నాడు చిరాగ్గా.

"ఆలోచనా? ఎందుకురా నీ బోడి ఆలోచనః నిన్ను కనటానికి పెంచటానికి మేము ఆలోచించామా? పొలాలు అమ్ముకుని నానా కష్టాలు పడి నిన్ను చదివించటానికి ఆలోచించామా? రెండుసార్లు ఫేలయ్యి మూడోసారి బి. ఎ పాసయ్యి ఏడిస్తే ఉద్యోగం యిప్పించటానికి ఆలోచిస్తూ కూర్చున్నామా? వాళ్ళకాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకుని రికమండేషన్లు చేయించటానికి, ఆ ఉద్యోగం యిప్పించిన వాడికి లంచాలు పెట్టటానికి ఆలోచించానా! సలక్షణంగా పెళ్ళి చేసుకోరా అంటే ఆలోచించాలీ? అంత తెలివిగా ఆలోచించేవాడివే అయితే ఈ క్లర్కు ఉద్యోగంలో ఎందుకు ఏడుస్తావు?"


చిట్టిబాబుకి చాలా కోపంవచ్చింది. విసురుగా తలఎత్తి ఏదో అనబోయి, అతికష్టంమీద తమాయించుకొని గొణుక్కుంటూ అవతలకి వెళ్ళిపోయాడు. ఎదురుతిరిగితే కోపంలో రెండు తగిలించినా తగిలిస్తారు వీరయ్యగారు. బి. ఏ మొదటి సంవత్సరం చివరలో చదవకుండా సెకండ్ షో సినిమాలకి వెళ్తున్నందుకు, సిగరెట్లు కాల్చటం నేర్చుకున్నందుకూ ఆయనచేత తిన్న దెబ్బలకి చిహ్నంగా ఎడమచేతిమీద చిన్న మచ్చ ఉండిపోయింది. మళ్ళీ ఆయన చేత దెబ్బలు తినే అవసరం రాకుండా ముందే మేల్కొలుపుతూ వుంటుంది స్మృతి చిహ్నం.

నిన్నేమీ విధవా వివాహాలు, వర్ణాంతర వివాహాలు చేసుకుని సంఘాన్నంతటినీ ఉద్ధరించేయమనటంలేదు. కనీసం కట్నం లేకుండా పెళ్ళి చేసుకో చాలు. దేశాన్నంతటిని ఉద్ధరించినంత ఘనకార్యం చేశావన్నమాటే. చదువుకునే రోజుల్లో ప్రకాశంఎప్పుడూ అనే మాటలుగుర్తుకు వచ్చాయి.

బాగా ఆలోచించుకోండి. మనయిద్దరి సంపాదనతో బ్రతకలేమంటావా? మీకు కావలసింది కేవలం డబ్బేనా? అభిమానం విడచి బ్రతిమాలలేక, అడగకుండావుండనూలేక వసుంధర బాధపడటం కళ్ళల్లో మెదిలి మనస్సు కలతబారింది.

ఎటూతెగని ఆలోచనల మధ్య నలుగుతూ, గొణుగుతూ పెళ్ళి చూపులకి బలవంతం మీద హాజరయ్యాడు.

సుమతి నల్లగావుంది. నచ్చలేదు. కనీసం స్కూలుఫైనల్ వరకయినా చదువుకోలేదు. — తన అభ్యంతరాలన్నింటినీ తల్లిదగ్గర ఏకరువు పెట్టాడు.



ఖండగిరి గుహలు ఫొటో : కె. వి. రామమోహన్‌రావు, భువనేశ్వర్

"సంసారం చేసుకునే ఆడదానికి అందం ఎందుకురా? భర్తగారి మాటలని గుర్తుకు తెచ్చుకుంటూ మరి నాలుగు కలిపి మెత్తగా మందలించింది ఆవిడ.

ఆలోచించటం అనవసరమేకాని ఆలోచనలతోనే జీవితాన్ని గడిపేయకూడదు. వృథా ఆలోచనలతోబాధపడుతూ ఎటూ పరిష్కరించుకోలేక కాలం గడిపేయటం అసమర్థతకి చిహ్నం.


జీవితాన్నంతటినీ పంచుకోవలసిన అర్ధాంగిని ఎంచుకోవటంలో ధనానికి అసలు ప్రాముఖ్యమే యివ్వకూడదు. వసుంధర అన్నివిధాల నీకు నచ్చింది. సుమతి అసలు నచ్చలేదు. ఆ అమ్మాయి తెచ్చే కట్నం మీ వాళ్ళని బాగా ఆకర్షించింది. నిన్నుకూడా ఆ సొమ్మే ప్రలోభపెడుతోంది, అనుకూల దాంపత్యం—డబ్బు ఈ రెండిటిలో నీకేది కావాలో నిర్ణయించుకో. వసుంధరనిచేసుకుంటే ఈరోజు కాదుపొమ్మన్నా కన్నకడుపు తీపి వాళ్ళను తిరిగి దగ్గరకు తెస్తుంది.

"జీవితాలన్నింటినీ మలిచే అతి ముఖ్యమైన ఈ మలుపులోనే పొరపాటు చేస్తే జీవితాంతం వరకూ దానికి ఫలితాన్ని అనుభవించవలసిందే. తర్వాత చేసింది పొరపాటు అని అనుభవపూర్వకంగా తెలిసినా సరిదిద్దుకోవటానికి మార్గం వుండదు." అని ఉత్తరాలలో ప్రకాశం చేసే దోషంకంటే. తల్లీ తండ్రీ. బంధుకోటి అప్తులు. ఇరుగూ పొరుగూ అందరూ విసుగులేకుండా చెప్పిందే చెప్పి అరిగిపోయిన రికార్డులా చేసే ఘోష చాలా రెట్లు ఎక్కువ కావడంతో గొణుగుతూనే ఎవర్నో ఉద్ధరిస్తున్నట్లు విసుక్కుంటూనే "ఊ" అనేశాడు. చిట్టి.

"మళ్ళీ ఎక్కడ మనసు మార్చుకుంటాడో అని వద్దనే లోపలే మూడు ముడులూ వేయించారు. పెద్దలంతా కలసి.

''ఒరేయ్ వెధవా! యింత పిరికి దద్దమ్మవి ఎందుకు ప్రేమించావురా? మీనాన్న తంతాడని నీకు ముందు తెలీదూ? కట్నంమీద ఆశలున్న వాడివి నీ దారిన నువ్వు ఏడవక మధ్య ఆ పిల్లకి ఆశలు ఎందుకు కల్పించావురా? నీలాంటి అసమర్థులూ, పిరికివాళ్ళూ వుండబట్టే మన దేశం యిలా తగలడింది. ఆడపిల్లలు మోసపోతున్నారు, ..." పెళ్ళి కానుకలా సరిగ్గా పెళ్ళయిన అరగంటకే వచ్చిన ప్రకాశం ఉత్తరం చదువుకుని ఉస్సురుమంటూ నిట్టూర్చాడు పాపం చిట్టిబాబు.

వసుంధరని ప్రేమించి పెళ్ళాడదామనుకున్నాడే కాని అంతకంటే చేసిన మోసం మరేమీ లేదుకదా అని సరిపెట్టుకో ప్రయత్నించాడు.



# అమావాస్య

తనలాంటివాళ్ళు ఎంతమందో వున్నారుకదా అని కాస్త తృప్తి పడ్డాడుకూడా.

ఎంతయినా మనదేశంలో యింకా పెద్దలంటే భయభక్తి చావలేదని తననితాను సమర్థించుకున్నాడు.

"ఒరేయ్ చిట్టీ," "చిట్టిగా" లాటి పిలుపులకి ఎక్కువగా అలవాటుపడిన చిట్టిబాబు "ఏమండీ" అనే సన్నని స్వరంలో ఏవేవో లోకాలు చూడటానికి ప్రయత్నిస్తూ కళ్లు మూసుకునేవాడు. తన్మయత్వం అలానే అనుభవిస్తారనే ఉద్దేశంలో కానీ వసుంధర రూపం జాలిగా దీనంగా కనపడేది, మూసుకున్న కళ్ళముందు.

"ఉలిక్కిపడి చూస్తే తన వైపు అనుమానంగా చూసే భార్యామణి కనపడేది. ఆ చూపులకి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిపోయేవాడు చిట్టి.

* * *

"ఎందుకూ ఏడుస్తున్నావు?" ఆఫీసు నుండీ వస్తూనే సతీసుమతి వాలకం చూసి అవతలకి వెళ్ళిపోదోతూ అడిగినందుకు అరగంటసాధింపు వినవలసివస్తుందనే భయంతో నిలబడి అడిగాడు.

"ఏడుపుకాక నాకు మిగిలిందేమిటి? ఆ బ్రహ్మ దేవుడే నా నుదుట రాశాడు ఏడుస్తూ బ్రతకమని" సన్నగా రాగాలు తీస్తూ అంది సుమతి.

"ఏడవమని ఎవరో రాయటం కాదు. నీకై నువ్వు చేసుకుంటున్నావు. ఎప్పుడూ ఏడుస్తూ వుండేవాళ్ళకి ఏడుపే మిగులుతుంది మరి" కాపురం పెట్టిన కొత్తలో ఘాటుగా సమాధానం ఇచ్చేవాడు.

"కాని ఇప్పుడా ఓపికా లేదు. సుమతి ఏడవటం వసుంధర నవ్వటం అంతసహజంగా కనిపిస్తోంది తనకి ఎందుకు ఏడుస్తున్నావని. అదేదో మామూలు పలకరింపులా తను యథాలాపంగా అడిగినప్పుడల్లా సుమతి అదే సమాధానం ఇస్తుంది. తనుకూడా తిరిగి తిరిగి అవే మాటలు అనలేడు.

"బ్రతకటం చేతనయినవాడికి జీవితం ఒక వరం.

"జీవితం విలువ తెలుసుకోలేని వాడికి బ్రతుకు ఒక శాపం.

"నాకుసుఖంగా సంతోషంగా బ్రతకటం చేతకాదు. యిక ఈ జన్మకి యింతే ఖర్మ" అని బాధపడుతూ నిట్టూర్చమని కాదు నా సలహా.

'నేనెందుకు హాయిగా బ్రతకలేను?" అని ధైర్యంగా తల ఎత్తుకుని నీలోవున్న లోపాలని తెలుసుకుని సరిదిద్దుకుని సంతోషంగా బ్రతకమని.

"అవ్వాకావాలీ బువ్వాకావాలి" అనేతత్వం మానుకో. వసుంధర కావాలి. నాన్నకి ఎదురు తిరగలేను— అని యిన్నిరోజులు బాధపడ్డావు యిప్పుడు వసుంధరిని పొందలేకపోయానని బాధపడుతున్నావు.

ఇది జీవితం బ్రదర్. పరిస్థితులని జయించ కలిగే తెగువ, నేర్పూ వుండాలి. అది చేతకాకపోతే పరిస్థితులకి అనుగుణంగా జీవితాన్ని మలుచుకోవాలి. ఏదీ చేతకానప్పుడు వృథా ఆలోచనలతో బాధపడుతూ నిరాశా నిస్పృహలను పెంచుకుని బ్రతకక తప్పదు. కనుక చావలేక బ్రతుకుతున్నాం అనే తత్వం మానాలి"

జేబులోవున్న ప్రకాశం ఉత్తరాన్ని ఒకసారి తడుముకుని నిట్టూరుస్తూ బయటికి వెళ్ళిపోయాడు చిట్టి.

భర్త వెళ్ళినవైపే చూస్తూ ముక్కు చీదుకుంది సుమతి.

మరో గంటన్నరకి చిట్టిబాబు తిరిగి వచ్చేసరికి ప్రక్కింటావిడ కాబోలు "ఏం చేస్తున్నావమ్మా, తలనొప్పి అన్నావుగా. తగ్గిందా?" అంటూ పరామర్శిస్తోంది.

"ఎన్ని నొప్పులు వచ్చినా వండి పడేయటం తప్పుతుందా పిన్నిగారూ. ఆయనగారు కాబట్టి నేను ఏడుస్తూ మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా హాయిగా హోటళ్ళకి వెళ్ళి కావలసింది తినేసి వస్తారు. పైగా వచ్చిన అరగంటకే అన్నం పెట్టమని కాస్త ఆలస్యమైతేచాలు విసుక్కుంటారు. నేను తిన్నానో లేదో ఆఖరికి కాఫీ నీళ్ళయినా తాగానో లేదో అని ఒక్కమాట అయినా అడగరు"

"ఏమిటో నమ్మా, కొత్తగా పెళ్ళయిన వాళ్ళంటే ఎంతయిదిగా వుంటారు?, ఎప్పుడూ ఏదో బాధలలో వున్నవాడిలా చిరాకుగా వుంటాడతను. పాపం ఆడకూతురివి. పగలంతా యింట్లోనే వుంటావు కదా అని సాయంత్రానికల్లా ఏ సినిమాకో, షికారుకో తీసుకువెళ్ళకూడదూ?"

ఆవిడ సానుభూతికి సుమతి కరగిపోయింది. అయ్యోరాత నా ముఖానికి అంత అదృష్టం కూడానా? అంటూ ఆపసోపాలు పడుతూ ఎన్నాళ్లగానో మనసులో దాచుకున్న వేదనంతా వెళ్ళగక్కేసింది.

అసలు నేననుకుంటాను పిన్నిగారూ కొందరి ముఖాలుచూస్తే ఆలా అనబుద్ధివేస్తుందేమోనని. మా అమ్మగారింట్లోవుండగానూ యింతే: యింటెడుపని నేనే చేసేదాన్ని. అయినా మా అమ్మ నన్నే ఆడుతూ వుండేది. మా చెల్లెలు మొన్న వచ్చి వెళ్ళింది చూశారుగా సుమాలిని, అది యివతలపుల్ల తీసి అవతల పెట్టమంటే ససే కదిలేదికాదు. పందిరి మంచంమీద పడుకొని కబుర్లుమాత్రం చిలకలా చెప్పేది. అవి విని మురిసిపోయేవాళ్లు మా వాళ్ళంతా. నా నోటితో నేను అనకూడదుకానీ పుట్టిల్లే అయినా అక్కడ ఎన్నిబాధలు వడ్డాననీ.


యింటికి పెద్దకూతురిని అనిపేరేకాని పెత్తనం అంతా దానిదే. నేను చెబితే తమ్ముళ్ళుగాని, పాలేర్లుగాని ఒక్క వెధవా వినేవాడు కాడు, ఆవిడగారి ఆజ్ఞ అయితే మారు మాట్లాడడానికి వీల్లేదు. ఎవరయినా తనమాట వినకపోతే నోరెత్తకుండా చివాట్లు పెట్టేది. అందుకే నాకు ఒళ్ళు మండుకొచ్చేది, నేను చెబితే వినరేమని తిడితే వెధవలు నవ్వేవాళ్ళు పైగా.

చెప్పే తీరున చెబితే ఎందుకు వినరు ఎవరయినా అనేది సుమాలిని. పైగా అమ్మకూడా దానికి వంతపాడేది ......"యింకా వినలేక తలపట్టుకుని కూర్చున్నాడు చిట్టి!

పుట్టింటివాళ్ళు తనని తక్కువగా చూశారని, రూపంలోనూ, గుణంలోనూ ఎందులోనూ తన పోలిక లేని చెల్లెలి మీద అసూయతో పరాయి వాళ్ళెవరికో చెప్పుకునే సుమతిని తెలివి తక్కువదనాలో? ఏమనాలి? ఆ తత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? భర్త గురించి తక్కువగా చెప్పుకుంటే బయట వాళ్ళకి తను చులకన అయిపోదూ?

మొదట్లో ఇరుగమ్మా పొరుగమ్మా పలకరించినా సరిగ్గా మాట్లేడేది కాదు. కాస్త నలుగురితో మంచితనంగా వుండమని ఎప్పుడూచెబుతూ వుండేవాడు. చివరికి వాళ్ళందరితో కాస్తబాగానే వుంటుందని సంతోషిస్తే యిలా యింటిగుట్టు రచ్చ కీడుస్తూంది. ఎలా ఈవిడని అర్థంచేసుకోవడం? చిట్టిబాబు బరువుగా నిట్టూర్చాడు.

ప్రక్కింటావిడ పనుందని వెళ్ళిపోవటంతో భర్త రాక గమనించి స్వాగతం ప్రారంభించింది. సుమతి



"మీ మరదలు ఉత్తరం వ్రాసింది. పెళ్ళాం రాచి రంపాన పెడుతోందని కష్టసుఖాలు చెప్పుకున్నారు కాబోలు. పాపం బావ మెత్తనివాడు. ఆయన మంచితనాన్ని నువ్వు అర్థం చేసుకోవటం లేదు. అలుసుగా తీసుకుని ఆయన్ని చిరాకు పెట్టకు అంటూ ఆరిందా చిన్నది. అది నాకు నీతులు బోధిస్తూ వ్రాయడమా? మిమ్మల్ని ఏం బాధ పెట్టాను? ఎప్పుడూ సణుగుతానట, అలా గొణగటం నాకు అలవాటైపోయిందట. పుట్టింట్లో కనుక అనవసరంగా ఎవర్ని ఏమన్నా అందరూ సర్దుకుని పోయేవారట. చిన్నా పెద్దా లేకుండా అది అలా వ్రాయటమా? ఏం వింటున్నారా మిమ్మల్నే"

చిట్టిబాబు మాట్లాడలేదు. తలనొప్పి వచ్చినా కంటతడి పెట్టుకోవటం సుమతికి ఎంత అలవాటో ఆవిడ ఎంత సణిగినా, సాధించినా మారు మాట్లాడకపోవటం అతనికి అంత అలవాటై పోయింది.

"పిచ్చిదానిలా అదే వాగి వాగి విసిగెత్తి ఊరుకుంటుంది అనుకుంటున్నారేమిటి? అంత పెళ్ళాన్ని భరించలేనివాళ్ళు పెళ్ళి ఎందుకు చేసుకున్నారు? అదేవ తనో ప్రేమించి పెళ్ళాడగోరినప్పుడు దాన్నే చేసుకుంటే సినిమాలలో లాగా జంటగా పాటలు పాడుకుంటూ హాయిగా సంసారాలు చేసుకునే పని."

ఎంతటి శాంతమూర్తులయినా యిరవై నాలుగు గంటలూ సణిగే వాళ్ళను భరించటం కష్టం. కోపం వస్తే నాలుగు ఉద్రేకంలో అనుకోవటం, ఆ తర్వాత దాన్నిగురించి మరిచిపోవటం సహజం. ప్రతి చిన్నదానికీ సణగటం అలవాటయిపోయిన వాళ్ళు తాము సుఖపడలేరు. ఎదుటి వాళ్ళని సుఖపెట్టనూ లేరు.

అమిత ఓపికగా కూర్చుని తన బాధ నంతటినీ ప్రకాశానికి వ్రాసుకున్నాడు చిట్టి.

జీవితాన్ని అందంగా తీర్చి దిద్దుకోవడం ఓ అద్భుతమైన కళ. ఉన్నవీ లేనివీ ఊహించుకుని జీవితాలను నరకయాతన చేసుకుని తాము బాధ పడుతూ ఎదుటివారినికూడా బాధపెట్టి వారిని చూసి జాలిపడాలో, అసహ్యించుకోవాలో అర్థం కాదు.

"బ్రతకటం చేతకాని వాడివి, నీకే ఈవిడ దొరకాలా అని బాధగా వుంది. నువ్వు మెత్తగా ఊరుకుంటే గయ్యాళి పెళ్ళాం అమాయకుడయిన మొగుడులా తయారవుతారు మీ రిద్దరూ. గట్టిగా విసుక్కుంటే రాగాలు పెడుతుంది అంటున్నావు కనుక మధ్యమార్గం అవలంబించి చూడు.

సమయానుకూలంగా, మృదువుగా ఆవిడని నీకు అనుకూలంగా తీర్చి దిద్దుకోవడానికి ప్రయత్నించు. తను చెల్లెలికంటే నల్లగా వుంటాననీ, తను చెల్లెలి కంటే అన్నివిధాల తక్కువ అనే యిన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో ఆవిడ బాధపడుతోందేమో? తనంటె ఎవ్వరికి ప్రేమాభిమానాలు లేవని, అందరూ తనని విసుక్కుంటారనే భావం ఆవిడలో అసంతృప్తిని కలిగిస్తోంది. అందుకే అలా సణుగుతూ తన చిరాకుని వెలిబుచ్చుకుంటుంది.

నువ్వు సహనంతో ప్రయత్నిస్తే ఆవిడలో మంచి మార్పే రావచ్చు.

అమావాస్యలో అందాలు చూడటంకూడా నేర్చుకోవాలి. పున్నమి వెన్నెలలో అందం ఆనందం అందరికీ తెలుసు. ఆ ఆనందాన్ని అనుభవించటానికి ప్రత్యేకమయిన ప్రయత్నమే అవసరంలేదు.

సామాన్యంగా ఆలోచించే పరిధిని కొద్దిగా అధిగమించి ఆలోచిస్తే అసంభవాలుకూడా సంభవం కావచ్చు.

కాటికలాంటి చీకటిలో మిణుకు మిణుకుమంటూ మెరిసే నక్షత్రాలు భావకుడికి నల్లని జార్జెటుచీర మీద అందంగా మెరుస్తున్న తారకలలా కనిపించవచ్చు.

మానవుడి అజ్ఞానంవంటి అమావస చీకటిలో, అప్పుడప్పుడూ మెదలో తళుక్కుమనే జ్ఞాన జ్యోతిలా ఏవో దివ్య సందేశాలన్నీ అందిస్తూ కాంతి పుంజాలలా కానవస్తాయి నక్షత్రాలు.

వెన్నెల అందంగా వుంటుంది అన్నంత సహజంగా వసుంధరని చేసుకుంటే ఎలాటి బాధా సమస్య వుండేదికాదు అన్న భ్రమలో పడకు.

మానవుడు నిత్యాన్వేషి. ఎప్పుడూ ఏదో శోధనతో నలిగిపోతూ ఏవేవో కోరికలతో అలమటిస్తూనే వుంటాడు.

జీవితం ఎంతకీ నిండని అసంపూర్ణమైన కుంభం లాంటిది. ఎన్ని కోరికలు నెరవేరినా యింకా ఏవో కోరికలు మిగిలిపోతూనే వుంటాయి.

జీవన స్రవంతి గమ్యాన్ని చేరే వరకూ ప్రతి మలుపులోనూ తనలో కొన్ని స్మృతులను తీసికెళుతూ కొన్ని పరిచయాలని విస్మరిస్తూ సాగిపోవాలి?

చిట్టీ నువ్వెప్పటికి చిట్టిబాబువే. కానీ,జీవితం అంటే ఏమిటో ఎరుగని చిన్నారి బాబువి కాదు. నవరసాలు కొన్ని పాళ్ళల్లో అనుభవించావు- మంచీ - చెడూ, కష్టం-సుఖం రెండూ జంటగా వుంటాయని అనుభవంలో తెలుసుకున్నావు. యింకా ప్రతి చిన్నవిషయానికి కదిలిపోతూ బాధపడిపోతూ,తెగని ఆలోచనలతో నిరాశపడిపోతూ జీవితం అంటే ఇంతేనన్న నిస్పృహకి లోను కావటం నాకేమీ నచ్చలేదు."

వారం రోజుల తర్వాత ప్రకాశం దగ్గర నుండి సమాధానం వచ్చింది.

చదవటం పూర్తిచేసి నిట్టూరుస్తూ కాగితాలు మడచి డ్రాయరులో పెట్టితాళం వేశాడు.

"అంతలావు ఉత్తరం వ్రాసిందెవరు? అదే వత్తో ప్రేమించి పెళ్ళాడ గోరినదేనా?" అనుమానంగా చూస్తూ వెటకారంగా అంటున్న సుమతిని ముఖంలోకి అరక్షణంపాటు చూసిముఖంప్రక్కకి తిప్పుకున్నాడు చిట్టి.

బయటంతా కారుచీకటి. ఎక్కడో బిడుకు బిడుకు మంటున్న నక్షత్రాలు ఒకటి అలా కిటికీలోనుండి కనిపిస్తున్నాయి.

బరువుగా చిట్టిబాబు కనురెప్పలు క్రిందికి వాలిపోయాయి.


నల్లని జార్జెట్ చీరలో అక్కడక్కడా మెరుస్తున్న చెమ్కీలలో అందంగా నవ్వుతూ కనిపించింది వసుంధర.

బాధగా కళ్ళుతెరచి చూశాడు.

మాసిపోయిన తెల్లని చీరలో ముక్కు చీదుకుంటూ కాటిక కళ్ళని ఒత్తుకుంటూ ఏదో గొణుగుతూ ఎదురుగా నిలబడింది సుమతి.

●


వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టరు



ప్రపంచప్రఖ్యాతిగాంచిన "విండ్‌సర్ - హిటాచి" ట్రాన్సిస్టర్‌సుపొందండి, 3 బ్యాండులు ప్రపంచంలోని అన్ని స్టేషన్లు వినవచ్చు. ట్రాన్సిస్టరు ఖరీదు రూ. [illegible]0/-లు మాత్రమే. రూ. 10/-ల నెలసరి వాయిదాలు. ఇండియాలోని ప్రతిగ్రామానికి& పట్టణానికి అందుతాయి. ఈ క్రింది చిరునామాకు దరఖాస్తు చేయండి.

SWISS TELEVISION Co.
(A.J-10) P.O. Box 1320, Delhi-6

3 నెలలవరకు ఉచిత బహుమతి



స్త్రీల సౌందర్యము కాశ్మీర్ ఆర్టు చీరెలు. ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లు, రంగులలో సీజనులకు తాజాగా వచ్చినవి. పెద్దసైజు మావద్ద మాత్రమే ఉన్నవి. వెల డీలక్స్ 1 చీరె రూ 11/-లు. 2 చీరెలు రూ. 20/-లు 3 చీరెలు రూ 28/-లు 4 చీరెలు రూ 36/-లు. రెండు లేక ఎక్కువ ఆర్డరిచ్చినవారికి ఒక బ్లౌజుముక్క ఉచితము. ఉచితము. ఆర్డర్లు పోస్టు పార్సెలుద్వారా పంపబడును.

[illegible] AGENCIES (AJW-42)
[illegible]